
సాక్షి ఒడిశా

మంగళవారం । 2 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.9,78,318లు, బంగారం 1గ్రాము 300 మిల్లీగ్రాములు, వెండి 81 గ్రాములు 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



త్వరలో మెట్రో పరుగులు

రాష్ట్రంలో త్వరలో మెట్రో రైలు పరుగులు తీయనుంది. కొత్త సంవత్సరం తొలిరోజు సోమవారం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశకు శంకుస్థాపన చేశారు.

- 8లో



కొంగొత్త ఆశలతో..!

రాష్ట్రవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను సోమవారం వైభవంగా జరుపుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన అరుణ్ కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణ్ కుమార్ షడంగి

భువనేశ్వర్: ఐపీఎస్ అధికారి అరుణ్ కుమార్ షడంగి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సోమవారం అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆదివారం ప్రభుత్వ సర్వీసు నుంచి ఉద్యోగ విరమణ పొందిన డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. నియమిత డీజీపీని నియమించే వరకు షడంగి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలీసు శాఖలోని అన్ని శాఖలపై తన దృష్టి ఉంటుందన్నారు. నేరాల గుర్తింపు, దర్యాప్తు, శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని వెల్లడించారు.

గుణాత్మక విద్యనందించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: విద్యార్థులకు గుణాత్మక విద్యనందిస్తేనే దేశ నిర్మాణంలో భాగస్వాములు అవ్వగలరని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో సోమవారం నిర్వహించిన యువ ఒడిశా – నవీన ఒడిశా ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. దేశ భవిష్యత్ విద్యార్థులపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. మంచి నడవడికతో తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మిత మెలక, ప్రిన్సిపాల్ డాక్టర్ సుచిత్ర మిశ్ర, నోడల్ అధికారి, అధ్యాపకురాలు డాక్టర్ కనకలత మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

లయిచన్ నాయిక్ సేవలు చిరస్మరణీయం



లయిచన్ నాయిక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం మొట్టమొదటి ఎమ్మెల్యే దివంగత లయిచన్ నాయిక్ ఆదివాసీ, హరిజన ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. జయపురం సిటిజన్ కమిటీ, కొరాపుట్ జిల్లా ఉత్కళ సమ్మిళని జయపురం శాఖ, పట్టణ కాంగ్రెస్ కమిటీలు ఆయన 44వ వర్ధంతి కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. లయిచన్ నాయిక్ కుమారుడు, జిల్లా ఆదివాసీ హరిజన కాంగ్రెస్ సెల్ మాజీ అధ్యక్షుడు రామ నాయిక్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మీన కేతన దాస్, జయంతి నాయిక్, గీతా ప్రకాశ్ చంద్ర మిశ్ర, బృందావన ఖొర తదితరులు పాల్గొన్నారు. అలాగే జయపురం కాంగ్రెస్ భవన్‌లో లయిచన్ నాయిక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత మదన మోహన్ నాయిక్, నరేష్ మహంకుడొ, అరుణ గోయెల్, నవీన మదల, ఈశ్వర షరాఫ్, పార్టీ కార్యదర్శి వెంకటరావు పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారంభం

రాయగడ: జిల్లాలో రోడ్డు భద్రతా వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం ప్రాంగణంలో వారోత్సవాల చైతన్య రథాన్ని ఎస్పీ వివేకానంద శర్మ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి శాఖ కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కర రైతా, ఆర్డీవో శివశంకర్ చౌదరి పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ వద్ద జిల్లా పాలనాధికారి స్మృతి రంజన్ ప్రధాన్ రోడ్డు భద్రతా వారోత్సవాల ప్రచార రథంను జెండా ఊపి ప్రారంభించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరమని, శిరస్త్రానం లేకుంటే రూ.1000 జరిమానా, మద్యం సేవించి బండి నడిపితే రెండు వేల జరిమానా వేస్తామన్నారు.

శ్రీక్షేత్రం కిటకిట

- మందిరంలో కొత్త సంవత్సరం సందడి
- అర్ధరాత్రి నుంచి దర్శనాలు
- అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ



భువనేశ్వర్: నూతన సంవత్సరం పురస్కరించుకుని శ్రీజగన్నాథుని దర్శనం కోసం శ్రీమందిరానికి భక్తులు పోటెత్తారు. సంవత్సరం చివరి రోజు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి అధికారులు స్వామివారి దర్శనం సౌకర్యం కల్పించారు. కొత్త విధానంతో లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏసీ విరామ సముదాయం గుండా భక్తులు ఆలయం లోపలికి ప్రవేశించారు. భక్తులు క్రమపద్ధతిలో వరుసలుగా వెళ్తున్నారు. 10 వరుసలలో భక్తులకు ఆలయంలోనికి ప్రవేశించేందుకు అనుమతించారు. బారికేడ్ల మధ్య విశ్రాంతి స్థలాలు ఏర్పాట్లు చేశారు. భక్తులకు స్వామి దర్శనం చేసుకునేందుకు విస్తృత ఏర్పాట్లు కల్పించారు. భక్తుల భద్రత, సులభ దర్శనం కోసం పూరీలో 22 ప్లాటూన్ల పోలీసులను మోహరించారు. మార్కెట్ కూడలి నుంచి శ్రీమందిర్ సింహద్వారం వరకు, సముద్ర తీరం నుంచి లైట్ హౌస్ కూడలి వరకు పోలీసులు వాహన రహిత జోనుగా ప్రకటించారు.

కొత్త నియమాలు అమలు

కొత్త సంవత్సరం పురస్కరించుకొని ఆలయంలో కొత్త నియమాలు అమలు ప్రారంభించారు. ఇక నుంచి సంప్రదాయ రీతిలో భక్తులు నిరాడంబరమైన వస్త్రధారణతో ఆలయానికి వెళ్లాల్సి ఉంటుంది. పురుషులు సంప్రదాయ దుస్తులు, ప్యాంట్లు, షర్టులు, మహిళా భక్తులు చీరలు, సల్వార్ సూట్‌లు ధరించి రావాలని తెలిపారు. హాఫ్ ప్యాంటు, చిరిగిన జీన్స్, స్లీవ్‌లెస్ షర్టులతో వచ్చే వారిని గుడిలోకి ప్రవేశం నివారించారు. దీంతో పాటు పొగాకు, కిళ్లీ, గుట్కాపై కూడా ఆంక్షలు విధించారు. పాలిథిన్ కూడా నిషేధించారు.



జగన్నాథుని దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

దామోదర్‌పై బహిష్కరణ వేటు ఎత్తివేత

- ప్రకటన విడుదల చేసిన బీజేడీ అధిష్ఠానం
- బీజేడీలోకి పునః ప్రవేశం..?



డాక్టర్ దామోదర్ రౌత్

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికార బిజూ జనతా దళ్ పార్టీ వ్యూహాలతో ముందుకెళ్తోంది. దీనిలో భాగంగా పలువురు సీనియర్ నాయకులకు పునః ప్రవేశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. బీజేడీ సీనియర్ నేత, మాజీ మంత్రి డాక్టర్ దామోదర్ రౌత్‌పై పార్టీ బహిష్కరణ వేటు తొలగించినట్లు బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలైనట్లు ప్రకటించారు. దీంతో సుదీర్ఘ 6 ఏళ్ల సస్పెన్షన్ తర్వాత ఆయన మరలా రాజకీయాల్లో సత్తా చాటేందుకు అవకాశం ఏర్పడింది.

6 ఏళ్ల క్రితం బహిష్కరణ

2018 సంవత్సరం సెప్టెంబర్‌లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయనపై వేటు వేశారు. రాష్ట్రంలో బిజూ జనతా దళ్ ప్రభుత్వం పలు అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతోందని బాహాటంగా దామోదర్ రౌత్ ఆరోపణలు చేసి రాష్ట్ర రాజకీయాల్లో గందరగోళం సృష్టించారు. దీంతో బీజేడీ అధిష్టానం ఆగ్రహించి ఆయనపై వేటు వేసింది. అయితే త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆయనను తిరిగి రంగంలోకి దింపే యోచనతో బహిష్కరణ ఉత్తర్వులు ఉపసంహరించుకున్నారు.

పార్టీ ఫిరాయింపు

బహిష్కరణ వేటుకు గురైన దామోదర రౌత్ 2019 సంవత్సరం మార్చిలో ఢిల్లీ వెళ్లి భారతీయ జనతా పార్టీలో చేరారు. కాగా ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో బీజేడీ ఆయనపై బహిష్కరణ తొలగించినట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జారీ చేసిన ఉత్తర్వులతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో మరోసారి కలకలం రేగింది. ఆయన గత ఎన్నికల్లో జగత్ సింగ్‌పూర్ జిల్లా బల్లికుదా – ఎరసమా నియోజకవర్గం నుంచి బీజేపీ టికెటుపై పోటీచేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 2019 సంవత్సరం అక్టోబర్‌లో బీజేపీకి రాజీనామా చేశారు.

అపార అనుభవం

నవీన్ పట్నాయక్ కొలువులో పలు కీలకమైన శాఖల్లో దామోదర్ మంత్రిగా పని చేశారు. రాజకీయ దురంధరుడుగా పేరొందిన ఆయన తొలిసారిగా 1977 సంవత్సరంలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తనయుడు సంబిత్ రౌత్రాయ్ రాజకీయ భవిష్యత్ దృష్ట్యా తండ్రి దామోదర రౌత్ బీజేడీ అధిష్టానంతో లోపాయికారీగా రాజీ కుదుర్చుకున్నట్లు ప్రధానంగా చర్చ కొనసాగుతోంది. జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ శాసనసభ నియోజకవర్గం నుంచి కుమారుడు సంబిత్ రౌత్రాయ్‌కు బీజేడీ టికెటు సాధించి బరిలో దింపడం దామోదర్ రౌత్ యోచన కాగా, ధీటైన పోటీనిచ్చేందుకు దోహదపడే రీతిలో దామోదర రౌత్‌ని బలమైన ప్రచార వారధిగా సద్వినియోగపరచుకోవడం బీజేడీ అంతరంగంగా భావిస్తున్నారు. దామోదర్ రౌత్ పునః ప్రవేశం జగత్‌సింగ్‌పూర్ జిల్లావ్యాప్తంగా బీజేడీ బలోపేతానికి ఉపకరించడం తథ్యమని బీజేడీ శిబిరాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. లోగడ అధికార పక్షం బీజేడీకి వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యల ఘాటు నేటికి ప్రామాణికంగా విపక్షాలు మలచుకుంటున్నాయి. బహిష్కరణ తొలగింపుతో తనయుడుని రంగంలోకి దింపితే ఈ విపత్తు నుంచి సులభ రీతిలో బీజేడీ బయటపడేందుకు అనుకూలిస్తుంది.

పట్టించుకునేవారేరీ..!



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- నిరుపయోగంగా 20 బస్సులు
- తుప్పు పడుతున్నా చర్యలు శూన్యం
- ఇప్పటికే అగ్నికి ఆహుతైన 3 బస్సులు

జయపురం: ప్రభుత్వ ఆస్తులపై అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాల్సిన బస్సులు నిరుపయోగంగా మారుతున్నా చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నటువంటి మావో ప్రభావిత కొరాపుట్ జిల్లాలో ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు 2016–17లో రాష్ట్ర ప్రభుత్వం 20 సిటీ బస్సులను జిల్లాకు సమకూర్చింది. ఈ బస్సులు నక్సల్ ప్రభావిత రూట్లలో ముఖ్యంగా కోట్‌పాడ్, బొరిగుమ్మ, జయపురం, కొరాపుట్, సునాబెడ, దమంజొడిలకు నడపాలని ప్రభుత్వం నిర్దేశించింది. కేంద్ర ప్రభుత్వ జవహర్ జాతీయ అర్బన్ డవలప్‌మెంట్ పథకంలో భాగంగా ప్రైవేట్ సంస్థ భాగస్వామ్యంతో 80 సిటీ బస్సులు నడపాలన్నది యోచన. మొదటి విడతగా 20 సిటీ బస్సులతో సర్వీసులు ప్రారంభించారు. ఈ బస్సులను నడిపే బాధ్యత జయపురంలోని గీతాంజలి సర్వెక్స్ ట్రాన్స్‌పోర్టుకు ఇచ్చి జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఒప్పందం చేసుకుంది. అయితే కొన్ని రోజుల అనంతరం కాంట్రాక్టు సంస్థ చేతులు ఎత్తేసి 20 బస్సులను బస్సు టెర్మినల్‌లో నిలిపివేసింది.

టెర్మినల్‌లోనే బస్సులు

అప్పటినుంచి బస్సులు టెర్మినల్‌లోనే తుప్పు పడుతున్నా ఇటు జిల్లా అధికారులు గానీ, బస్సుల బాధ్యతలు తీసుకున్న ప్రైవేటు సంస్థ గానీ పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గతేడాది నవంబర్ 3వ తేదీన రెండు బస్సులు అగ్నికి ఆహుతి కాగా, ఇటీవల మరో బస్సు మంటల్లో బూడిదైంది. కనీసం కొద్ది నెలలు కూడా నడపకుండానే బస్సులు తుప్పు పడుతూ, స్పేర్‌పార్టులు దొంగిలించబడుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని ప్రజలు దుయ్యబడుతున్నారు. ఇప్పటికైనా మిగిలిన 17 బస్సులను ప్రజల సౌకర్యార్థం వినియోగించాలని కోరుతున్నారు.



మంటల్లో దగ్ధమవుతున్న సిటీ బస్సు

ఇస్రో బృందానికి అభినందనలు

భువనేశ్వర్: శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి భారతదేశపు మొట్టమొదటి ఎక్స్‌-రే పొలారిమీటర్ శాటిలైట్ (ఎక్స్‌పో శాట్)ను సోమవారం విజయవంతంగా ప్రయోగించినందుకు గవర్నర్ రఘుబర్ దాస్, రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌లు ఇస్రో శాస్త్రజ్ఞుల బృందానికి అభినందనలు తెలియజేశారు. ఎక్స్‌పో శాట్ ఉపగ్రహం కాస్మిక్ మూలాల నుంచి ఎక్స్‌-రే ఉద్గారాలను అధ్యయనం చేయడంలో అవగాహనను మెరుగుపరచడానికి శాస్త్రజ్ఞుల సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



లేబర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

జయపురం: సమితిలోని గగణాపూర్‌లో ఉన్నటువంటి సేవా పేపరు మిల్లు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు కార్మిక సంఘ నేతలు కోరారు. వందలాది మంది కార్మికులు స్థానిక బస్టాండ్ కూడలి నుంచి ర్యాలీ నిర్వహిస్తూ డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయానికి సోమవారం వెళ్లారు. కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్, జిల్లా లేబర్ అధికారి లేకపోవడంతో సహాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ 2020లో మిల్లును మథర్ అర్థ కంపెనీకి అప్పగించగా గత నాలుగేళ్లలో రూ.208 కోట్ల రుణం తీసుకుందని, అయినా సక్రమంగా మిల్లు నడపలేదని ఆరోపించారు. మరణించిన కార్మిక కుటుంబాలకు బకాయలు ఒక నెలలో చెల్లిస్తామని 2023 మార్చిలో ఇచ్చిన హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు 4 నెలల జీతాలు చెల్లించడం లేదన్నారు. లేబర్ కమిషనర్ వెంటనే సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు జుధిష్టర్ రౌళో, సాధారణ కార్యదర్శి ప్రదీప్ పాంజియ, కార్యదర్శి బణమాలి పాత్రో, నారాయణ దాస్, బసంత బెహర పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు శశిభూషణ్ రథ్



శశిభూషణ్ రథ్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న భగవాన్ గంతాయత్

బరంపురం:

ప్రస్తుత సమాజానికి శశిభూషణ్ రథ్ ఆదర్శనీయుడని ఎస్ఎంఐటీ అధ్యక్షుడు భగవాన్ గంతాయత్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్‌లో ఎస్ఎంఐటీ ఆధ్వర్యంలో దివంగత శశిభూషణ్ రథ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టౌన్‌హాల్ ప్రాగణంలో ఆయన 140వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ గంతాయత్ మాట్లాడుతూ.. బరంపురం మున్సిపాలిటీ మొట్టమొదటి వైస్ చైర్మన్‌గా శశి భూషణ్ ఉన్నప్పుడు బరంపురం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఒడిశాలో మొట్టమొదటి సారిగా 'దాని ఆశా' ఒడియా దినపత్రిక స్థాపించి ప్రజలను చైతన్యపరిచేందుకు కృషి చేశారని వెల్లడించారు. ఒడియా భాష పరిరక్షణకు ఆయన ఎనలేని సేవలందించారన్నారు. కార్యక్రమంలో దని ఆశా ఎడిటర్ ప్రమోద్ కుమార్ పండా, కార్యదర్శి జమ్ముల శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూరత్ టూర్‌కు గిరిజన యువత



గిరిజన యువతతో బీఎస్ఎఫ్ అధికారులు



యువకుడికి ఐడీ కార్డు అందజేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లా బీఎస్ఎఫ్ జవాన్‌ల తరుపున 30 మంది గిరిజన యువతను సూరత్ టూర్‌కు తీసుకెళ్తున్నారు. మత్తిలి సమితి సలీమ్, ధనిగూడ, కొత్తపల్లి, ఖడిమేట్ల, రంగినిగూడ, గోలియాగూడ తదితర గ్రామాలకు చెందిన 19 మంది యువకులు, 11 మంది యువతిలను ఈసారి ఎంపిక చేశారు. బీఎస్ఎఫ్ అధికారి శలేంద్ర కుమార్ సిన్హా జనవరి 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వీరిని గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ తీసుకెళ్తారు. అక్కడ పలు పర్యాటక ప్రదేశాలతో పాటు సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు, క్రీడాకారులను కలిపిస్తారు. ప్రయాణమవుతున్న వారికి ఐడీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో 2వ బెటాలియన్ జవాన్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లింగరాజ్ ఆలయంలో గుట్కా నిషేధం



లింగరాజు దేవస్థానం

భువనేశ్వర్: స్థానిక లింగరాజ్ దేవాలయం కొత్త సంవత్సరం తొలిరోజు నుంచి సరికొత్త నియమ నిబంధనలను అమలు చేసినట్లు ప్రకటించింది. ప్రధానంగా ఆలయ ప్రాంగణంలో పాన్, గుట్కా, పాలిథిన్ నిషేధం ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. పూరీ జగన్నాథ దేవస్థానం తరహాలో ఈ నిషేధం అమలు చేసినట్లు ఆలయ ట్రస్టు వర్గాల సమాచారం. కొత్త సంవత్సరం 2024 తొలిరోజు సోమవారం నుంచి సరికొత్త నియమావళికి శ్రీకారం చుట్టారు. ఆలయ సముదాయంలో క్రమశిక్షణ, పరిశుభ్రతను కాపాడే ప్రయత్నాల్లో భాగంగా రాష్ట్ర రాజధానిలోని ప్రముఖ శైవక్షేత్రం లింగరాజు ఆలయం లోపల పాన్, గుట్కా, పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని లింగరాజ్ ఆలయ ట్రస్ట్ బోర్డు నిషేధించినట్లు తెలిపింది. అలాగే భక్తులు పువ్వులు, ప్రసాదాలు ఇతర పూజా సామాగ్రిని పాలిథిన్ కవర్లలో తీసుకెళ్లకూడదని స్పష్టం చేశారు.

స్వచ్ఛమైన నెయ్యితో ప్రసాదాలు

ఓంఫెడ్ తయారు చేసిన స్వచ్ఛమైన నెయ్యితో లింగరాజు మహా ప్రభువుకు నివేదించే ప్రసాదం వంటకాలు తయారు చేయనున్నట్లు ట్రస్టు వర్గాలు తెలిపాయి. శ్రీలింగరాజు ఆలయ ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు, ఖుర్దా జిల్లా కలెక్టర్ కె.సుదర్శన్ చక్రవర్తి ఈ మేరకు లేఖ జారీ చేసినట్లు ఈ వర్గాలు పేర్కొన్నాయి. ఆలయంలో నిత్య సేవాదులు, పూజాదులు, ఉత్సవాదుల ఆచారాల నిర్వహణ, వ్యవహారంలో క్రమశిక్షణను పరిరక్షించేందుకు ధర్మకర్త మండలి తీర్మానించింది. ఈ ప్రక్రియలో భాగంగా సేవకులందరికీ 15 రోజుల్లో గుర్తింపు కార్డులను జారీ చేయాలని ఆలయ ట్రస్ట్ బోర్డు నిర్ణయించడం విశేషం.

పక్షుల గణనకు సన్నాహాలు

భువనేశ్వర్:

చిలికా సరస్సులో వార్షిక పక్షుల గణన ఈనెల 4న ప్రారంభం కానుంది. చిలికా డీఎఫ్‌వో కార్యాలయ వర్గాల సమాచారం ప్రకారం చిలికా వన్యప్రాణి విభాగం పరిధిలోని బలుగాంవ్, టంగి, చిలికా, రంభ, సతొపాడా అనే ఐదు రేంజ్‌లలో వలస అతిథి పక్షుల గణన నిర్వహించబడుతుంది. వన్యప్రాణి సిబ్బందితో పాటు, వివిధ సంస్థల నిపుణులు పక్షుల లెక్కింపు ప్రక్రియలో పాలుపంచుకుంటారు. అతిపెద్ద ఉప్పునీటి సరస్సు చిలికాలో అటవీ శాఖకు చెందిన 21 బృందాలు పక్షుల గణనలో పాల్గొంటాయి. వన్యప్రాణి అధికారులు, గైడ్‌లను కూడా ఈ కసరత్తులో మోహరిస్తారు. పూరీ, ఖుర్దా, గంజాం జిల్లాల్లో విస్తరించి ఉన్న చిలికా సరస్సులో పక్షుల గణనను నిరంతరాయంగా నిర్వహించడానికి సరస్సుకు పర్యాటకుల సందర్శన తాత్కాలికంగా నిలిపివేస్తారు. అతిథి పక్షుల గణన పూర్తయ్యాక సందర్శకులపై ఆంక్షలు తొలగిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రతీ సంవత్సరం చలి కాలంలో కాస్పియన్ సముద్రం, బైకాల్ సరస్సు, రష్యాలోని మారుమూల ప్రాంతాలు, మధ్య, ఆగ్నేయ ఆసియా, లడఖ్, హిమాలయాల నుంచి వలస అతిథి పక్షులు ఈ సరస్సును సందర్శిస్తాయి. వివిధ ప్రాంతాలకు చెందిన పలు రకాల పక్షులకు ఈ సరస్సు పర్యావరణం అత్యంత అనుకూలం. చలి కాలంలో అల్లంత దూరం నుంచి విచ్చేసిన అతిథి పక్షులు తిరిగి వేసవి తాకిడి ప్రారంభం వరకు ఇక్కడే నిరవధికంగా బస చేస్తాయి. ఈ వ్యవధిలో సంతానోత్పత్తికి అనుకూల పరిస్థితులు నెలకొని ఉంటాయి.



చిలికా సరసులో పక్షుల విహారం

క్లుప్తంగా

ఎస్పీ రాధికకు 12 పే మ్యాట్రిక్స్ స్కేల్



శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ జీఆర్ రాధికకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ లెవెల్ 12 పే మ్యాట్రిక్స్ స్కేల్‌ను ప్రభుత్వం కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించగా.. ఎస్పీ కూడా ఆ జాబితాలో చోటు సంపాదించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఆమెకు అభినందనలు తెలిపింది.

రేంజ్ ఐజీగా హరికృష్ణ బాధ్యతల స్వీకరణ



ఐజీగా బాధ్యతలు స్వీకరించిన హరికృష్ణ

సాక్షి, విశాఖపట్నం: విశాఖ రేంజ్ ఐజీగా హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రేంజ్ డీఐజీగా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణకు ఐజీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లైఫ్ సర్టిఫికెట్ స్వీకరణకు హెల్ప్‌డెస్క్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ స్వీకరణకు హెల్ప్ డెస్క్‌ను జిల్లా ఖజానా కార్యాలయంలో ప్రారంభించినట్లు ఉప సంచాలకులు సీహెచ్ రవి కుమార్ అన్నారు. జిల్లాలోని ఖజానా కార్యాలయం పరిధిలో గల పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలని తెలిపారు. ప్రతి ఉప ఖజానా పరిధిలో కూడా పింఛన్‌దారుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామన్నారు. పింఛన్‌దారులు ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్లను అందించాలని తెలిపారు.

పదోన్నతుల ధ్రువీకరణ పత్రాల అందజేత



పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ఆర్డర్స్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: కారుణ్య నియామకాలు, ప్రమోషన్లు జీవితాల్లో ఆనందాన్ని అందిస్తాయని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆమె సోమవారం మండలంలోని బల్లిపుట్టుగలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ క్యాంప్ కార్యాలయంలో పలువురికి ప్రమోషన్ల పత్రాలతో పాటు కారుణ్యనియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. పదోన్నతులు పొందిన వారికి, కొత్త ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

ఆదిత్యాలయ వసతి గదులకు రూ.3 లక్షల విరాళం



రూ.3 లక్షల నగదును శంకరశర్మకు అందజేస్తున్న దాత సత్యారావు దంపతులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల వసతి గదుల నిర్మాణానికి నగరానికి చెందిన వ్యాపారవేత్త కోరాడ సత్యారావు, మాధవి దంపతులు రూ.3 లక్షల విరాళాన్ని సోమవారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మకు అందజేశారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి ఆధ్వర్యంలో దాత కుటుంబ సభ్యులు ముందుగా ఆదిత్యుడిని ప్రత్యేకంగా దర్శించుకుని, వసతి గదులకు గాను నూతన సంవత్సరం సందర్భంగా రూ.3 లక్షల నగదును అందజేశారు. ఈ సందర్భంగా మండవిల్లి రవి మాట్లాడుతూ.. మంత్రి ధర్మాన పిలుపు మేరకు తామంతా దాతల సహకారాన్ని అభ్యర్థిస్తున్నామని, దీంతో అరసవల్లి ఆలయాన్ని సౌకర్యాల పరంగా అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దాత కోరాడ సత్యారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటి వీధిలో ని వాసం ఉంటున్న తాళాసు రామలక్ష్మి (86) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆమె కుమారుడు తాళాసు తౌడు తల్లి కళ్లను దానం చేయాలని నిర్ణయించుకుని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేశారు. దీంతో మగటపల్లి క ల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా ఆమె కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను చైర్మన్ అభినందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకునే వాళ్లు 78426 99321 నంబరుకు కాల్ చేయాలని కోరారు.

త్వరలో మెట్రో పరుగులు

- ప్రాజెక్టు తొలి దశకు శంకుస్థాపన
- రాష్ట్ర చరిత్రలో మరువురాని రోజు: సీఎం నవీన్

భువనేశ్వర్: రాష్ట్రంలో త్వరలో మెట్రో రైలు పరుగులు తీయనుంది. కొత్త సంవత్సరం తొలిరోజు సోమవారం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బరంగ్ రతగఢ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో ఈరోజు ఒక ప్రత్యేక రోజుగా నిలిచిపోతుందన్నారు. రవాణా రంగంలో పెద్ద మార్పు రాబోతోందని తెలియజేశారు. మెట్రో రైలు కోసం ఇచ్చిన హామీని నెరవేర్చినట్లు అయిందన్నారు. లక్ష్మీ బస్సు రవాణా పథకం గ్రామాల్లో పరివర్తన తీసుకొచ్చిందన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు ఈ పరివర్తనను మరింత ముందుకు తీసుకెళ్లనుందని పేర్కొన్నారు. కొత్త రాజధాని భువనేశ్వర్‌తో పాత రాజధాని కటక్ మధ్య అనుసంధానం మరింత బలపడుతుందని తెలియజేశారు.

తొలిదశలో 26 కిలోమీటర్లు

స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి త్రిశూలియా వరకు 26 కిలోమీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశను నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పరిధిలో 20 స్టేషన్లు ఉంటాయన్నారు. ప్రాజెక్టు వ్యయ ప్రణాళిక రూ.6,255.94 కోట్లుగా ప్రకటించారు. ఈ ప్రాజెక్టు 5టీ చొరవలో రాష్ట్రానికే తలమానికమైన ప్రాజెక్టు అని తెలియజేశారు. ప్రాజెక్టుకు అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో మౌలిక సదుపాయాల రంగంలో ఇది అతిపెద్ద పెట్టుబడి ప్రాజెక్టుగా అభివర్ణించారు. ఖుర్దా, పూరీ, కటక్ వరకు మెట్రో రైల్ విస్తరణకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని కోరారు. నవీన ఒడిశా, సాధికారత ఒడిశాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.



బిజూ పట్నాయక్ విగ్రహం ఆవిష్కరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

ఆకట్టుకున్న రోడ్ షో

ఈ సందర్భంగా ప్రతిపాదిత మెట్రో ప్రాజెక్టు 26 కిలోమీటర్ల దారి పొడవునా నిర్వహించిన రోడ్ షో విశేషంగా ఆకట్టుకుంది. ముందుగా స్థానిక ఎయిర్‌పోర్ట్ కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్యాపిటల్ హాస్పిటల్ చౌక్, 120 బెటాలియన్, జయదేవ్ బీహార్ చౌక్, జేవియర్ చౌక్, రైల్ సదన్, జిల్లా కేంద్రం, ఇండియన్ ఆయిల్ చౌక్, కెఐఐటి చౌక్, నందన్ విహార్, రఘునాథ్‌పూర్‌లలో రోడ్ షో నిర్వహించారు. దీనిలో భాగంగా నందన్‌కానన్ చౌక్‌లో బిజూ పట్నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బారంగ్ రతగఢ్ చేరుకుని మెట్రో రైలు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

నాలుగు నెలల్లోనే ప్రాజెక్టు రిపోర్టు

2023 సంవత్సరం నవంబర్ 14న మంత్రి మండలి ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఆమోదం పొందిన 4 నెలల్లోనే ప్రాజెక్ట్ రిపోర్టు సిద్ధం చేశారు. కొత్త సంవత్సరం 2024 తొలిరోజున శంకుస్థాపన జరిగింది. బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి త్రిశూలియా వరకు మెట్రో రైలు నిర్మాణం కోసం భువనేశ్వర్ మెట్రో రైల్ కార్పొరేషన్ ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ)తో ఒప్పందం కుదుర్చుకుంది.



మెట్రో రైలు ప్రాజెక్టు శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం నవీన్ పట్నాయక్ తదితరులు

మెట్రో రైలు హాల్టులు

మెట్రో రైలు ప్రాజెక్ట్ మొదటి దశ 20 స్టేషన్లతో 26 కిలోమీటర్ల పరిధిలో ఆధునిక రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ), క్యాపిటల్ హాస్పిటల్, శిశు భవన్, బాపూజీ నగర్, భువనేశ్వర్ రైల్వేస్టేషన్, రామ్ మందిర్ స్క్వేర్, వాణి విహార్, ఆచార్య విహార్ స్క్వేర్, జయదేవ్ విహార్, స్క్వేర్, జేవియర్ స్క్వేర్, రైల్ సదన్, డిస్ట్రిక్ట్ సెంటర్, డొమొణ స్క్వేర్, పాటియా స్క్వేర్, కిట్ స్క్వేర్, నందన్ విహార్, రఘునాథ్‌పూర్, నందనకానన్ జూలాజికల్ పార్క్, ఫులాపొఖొరి, త్రిసూలియా స్క్వేర్ హాల్టులుగా ఉంటాయి.



శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

కల సాకారమవ్వనుంది

ఈ సందర్భంగా సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత శాఖ మంత్రి అశోక్ చంద్ర పండా మాట్లాడుతూ.. ఆలయ నగరం భువనేశ్వర్ నుంచి పాత రాజధాని కటక్ వరకు మెట్రో రైలును నడపాలన్నది రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నమన్నారు. నేటితో కల సాకారం అవ్వనుందని పేర్కొన్నారు. రైతు సాధికారత శాఖ మంత్రి రణేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ఒడిశాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెడుతుందన్నారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఉషాదేవి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు ద్వారా ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో 5టీ, నవీన్ ఒడిశా చైర్మన్ వి.కార్తికేయ పాండియన్, కటక్ మేయర్ సుభాష్ సింగ్, భువనేశ్వర్ మేయర్ సులోచన దాస్, ఎమ్మెల్యేలు దేవి రంజన్ త్రిపాఠి (బంకి), సౌవిక్ బిస్వాల్ (చౌద్వార్ - కటక్), సుశాంత్ రౌత్ (భువనేశ్వర్ ఉత్తర), అనంత్ నారాయణ్ జెనా (భువనేశ్వర్), చంద్రశేఖర సారథి బెహెరా (కటక్ సదర్) తదితరులు పాల్గొన్నారు.

కొంగొత్త ఆశలతో..!

రాష్ట్రవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను సోమవారం వైభవంగా జరుపుకున్నారు. రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు వ్యక్తులు అనాథ పిల్లలతో వేడుకలు జరుపుకున్నారు. కొన్నిచోట్ల సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొరాపుట్: కార్యకర్తలతో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని దంపతులు



కొరాపుట్: కేసీసీ బ్యాంక్ క్యాలెండర్ విడుదల చేస్తున్న అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర పాణిగ్రాహి



కొరాపుట్: డీఐజీ చరణ్ సింగ్ మీనాకు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెటి



పర్లాకిమిడి: జి.సీతాపురంలోని చైల్డ్ కేర్ యూనిట్‌లో వేడుకలు జరుపుకుంటున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్



బరంపురం: అన్నపూర్ణ మార్కెట్‌లో కొనసాగుతున్న అమ్మకాలు



రాయగడ: చర్చిలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: ఎమ్మెల్యే నారాయణరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోడూరు కిరణ్



రాయగడ: నెక్కంటికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి



పర్లాకిమిడి: ఎమ్మెల్యే నారాయణరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



బరంపురం: ఎంపీ చంద్రశేఖర్ సాహుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ సంఘమిత్ర



బరంపురం: ఎమ్మెల్యే విక్రమ్ పండాకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘమిత్ర దొళాయి

భక్తిశ్రద్ధలతో పూజలు

బరంపురం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు శక్తి పీఠాలతో పాటు ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మా బుడి శాంతమ్మ ఆలయంలో ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తరతరిణి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక సంధ్యా హారతి ఇచ్చారు. గాయత్రి మాత ఆలయంలో 150 రకాల పుష్పాలతో పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



ప్రత్యేక పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక పూజలందుకుంటున్న మా బుడి శాంతమ్మ



పూజలందుకుంటున్న చిన్న కాళికా అమ్మవారు



తరతరణి శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు



150 రకాల పుష్పాలతో గాయత్రి మాతకు పూజలు

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న ఏడీఎం రైతా

రాయగడ: స్థానిక జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సమావేశ మందిరంలో వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సోమవారం నిర్వహించింది. వివిధ ప్రాంతాలకు చెందిన 15 మంది వినతులు స్వీకరించారు. వీటిలో 5 గ్రామ సమస్యలు కాగా, మిగతావి వ్యక్తిగత సమస్యలుగా గుర్తించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఏడీఎం రైతా సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కర రైతా, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రైత్రాయ్, రాయగడ సమితి బీడీవో అమూల్య కుమార్ సాహు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి దిలీప్ కుమార్ బెహెర తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ



ఆశ్రమంలోని చిన్నారులతో క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్టు అనాథ ఆశ్రమానికి ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు 30 కుర్చీలను వితరణగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఇప్పిలి సన్యాసిరాజు, కార్యదర్శులు జి.శ్రీనివాస్‌రావు, జి.భాస్కరరావు తదితర సభ్యులు కుర్చీలను ఆశ్రమ నిర్వాహకురాలు ఎం.నళినికి సోమవారం అందజేశారు. అదేవిధంగా ఆశ్రమంలో చిన్నారులకు బిస్కెట్లు, పండ్లను పంచిపెట్టారు.

క్లుప్తంగా

మంత్రి బొత్సను కలిసిన ఐఐటీ డైరెక్టర్



మంత్రి బొత్సను కలిసిన ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ

విజయనగరం అర్బన్: నూతన సంవత్సరం సందర్భంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణను ఆయన నివాసంలో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరికీ శుభాలు కలగాలని మంత్రి బొత్స సత్యనారాయణ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం శక్తి వంచన లేకుండా పనిచేస్తున్న ఆర్జీయూకేటీ యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఓఎస్డీ సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అనిరాయుడు, డీన్ వెల్ఫేర్ రవి, పీఆర్ మామిడి షణ్ముఖ, ఐఐటీ ఉన్న తాధికారులు ఉన్నారు.

జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సుస్మితకు స్వర్ణం



సాధించిన పతకాలను చూపిస్తున్న సుస్మిత

నెల్లిమర్ల రూరల్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో జరుగుతున్న డిసెంబర్ 28 నుంచి ఐదు ఖ్యూఎల్‌ఎస్ జాతీయస్థాయి యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన క్రీడాకారిణి వల్లూరి సుస్మిత స్వర్ణ పతకం సాధించింది. 55 కేజీల యూత్ విభాగంలో పోటీలో పాల్గొన్న సుస్మిత స్నాచ్‌లో 77 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 96 కిలోలు..మొత్తం 173 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకం దక్కించుకుంది. అలాగే జూనియర్ విభాగంలో రజత పతకం కై వసం చేసుకుంది. ప్రతిభ కన బరిచిన క్రీడాకారిణికి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మి, వెంకటరామయ్య, చల్లా రాము, తదితరులు అభినందనలు తెలిపారు.

ఏపీఎస్ఈజీఎస్ సభ్యుడిగా అల్లు లావణ్యకుమార్



అల్లు లావణ్యకుమార్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ కౌన్సిల్ (ఏపీఎస్ఈజీసీ) సభ్యుడిగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన అల్లు లావణ్యకుమార్ (రామారావునాయుడు) నియమితులయ్యారు. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఐఆర్పీడబ్ల్యూఏ) కోశాధికారిగా సేవలందిస్తున్న ఆయనకు ఈ ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో తనకు తోడ్పాటు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణికి ధన్యవాదాలు చెప్పారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జగనన్న సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి స్వప్న



మందులను పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి స్వప్న

వెంకాడ: ఈ నెల రెండో తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర నోడల్ అధికారి స్వప్న కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాలకు అవసరమైన మందుల నిల్వలను పరిశీలించారు. కార్యక్రమం విజయవంతమయ్యేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వైద్యులు భవాని, శివరామకృష్ణలను ఆదేశించారు.

మహిళకు మరింత రక్ష!

- మహిళలకు అండగా దిశ వన్‌స్టాప్ సెంటర్
- సమస్యను బట్టి సత్వర సాయం
- వైద్యం, న్యాయం, రక్షణ, సంరక్షణ ఇలా సాయమేదైనా..
- కౌన్సిలింగ్, పోలీస్, న్యాయసేవల ద్వారా సమస్యల పరిష్కారం
- ఆరేళ్లలో అందిన ఫిర్యాదులు 3,363



బాధితులకు కౌన్సిలింగ్ ఇస్తున్న దిశ వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది



దిశ వన్‌స్టాప్ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: దిశ వన్‌స్టాప్ సెంటర్ మహిళలకు మరింత రక్షణ కల్పిస్తోంది. వివిధ సమస్యలతో సతమతమవుతున్న ఆడవాళ్లంతా ఇక్కడికి వస్తారు. రక్షణ కావాలని కొందరు, సంరక్షణ కావాలని మరికొందరు విన్నవించుకుంటారు. ఇలాంటి వారందరికీ తగిన సహాయం, సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారు.. దిశ వన్‌స్టాప్ సెంటర్ కార్యాలయ సిబ్బంది. సమస్య ఏదైనా ఓపికగా విని, వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ బ్యారెక్స్ పక్కనే ఈ కార్యాలయం ఉంది. 2017 దీనిని ఏర్పాటు చేశారు. బాధిత మహిళలకు సత్వర న్యాయం, వైద్యం, రక్షణ, సంరక్షణ కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ఆపదలో ఉన్న వారైనా, ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారైనా కార్యాలయానికి నేరుగా వచ్చి గానీ ఫోన్ ద్వారా గానీ తమ సమస్యను చెప్పుకోవచ్చు. ఇంట్లో భర్త, అత్తమామల నుంచి వరకట్న వేధింపులు, గృహహింస, లైంగికదాడి, యాసిడ్ దాడి, హత్యాయత్నానికి గురైన వారు, ప్రేమ పేరిట మోసపోయిన వారు, పలు సమస్యల కారణంగా ఇంటి నుంచి బయటకు వచ్చిన వారు, ఇంట్లో నుంచి గెంటివేయబడిన వారంతా బాధి తులే. ఇలాంటి వారందరికీ శ్రీరామరక్షలా దిశ వన్‌స్టాప్ సెంటర్ నిలుస్తోంది. దీంతో బాధితుల్లో చాలామంది మహిళలు తమ సమస్యలు తొలగి, ఆనందంగా ఉంటున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదుల వివరాలిలా..

ఫిర్యాదు విభాగం	ఫిర్యాదుల సంఖ్య
రిజిస్టర్ అయిన ఫిర్యాదులు	1671
భార్యాభర్తల మధ్య వివాదాలు	531
అత్యాచారాలు	150
లైంగిక వేధింపులు	53
యాసిడ్‌దాడులు	2
మానవ అక్రమరవాణా	2
పిల్లలపై లైంగిక వేధింపులు	3
బాల్యవివాహాలు	47
బాలికల కిడ్నాప్, అదృశ్యం	139
సైబర్ క్రైమ్	14
వరకట్న వేధింపులు	11
ఇతర కేసులు	719

శాశ్వత పరిష్కారం..

ఏదైనా సమస్య పరిష్కారానికి కార్యాలయాన్ని ఆశ్రయించే మహిళల ఫిర్యాదుల ఆధారంగా ఇరువర్గాలను పిలిపించి, కౌన్సిలింగ్ ఇస్తారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాపోతే పోలీస్, న్యాయసహాయం తీసుకుని, సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకుంటారు. గడిచిన ఆరేళ్లలో 3,363 ఫిర్యాదులు అందాయి. వీటన్నింటినీ దిశ వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది పరిష్కరించారు. వీటిలో లీగల్ ఎయిడ్, కౌన్సిలింగ్ సపోర్ట్ 244 మందికి, వైద్య సహాయం 649 మందికి, 652 మందికి పోలీస్ అసిస్టెంట్ సాయం అందించారు. 65 మందికి షెల్టర్ సాయం కల్పించారు. సైకో సోషల్ కౌన్సిలింగ్ సపోర్ట్ 1643 మందికి, 14 మందికి ప్రభుత్వ పథకాలు ఇచ్చారు. కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా 96 మంది మహిళల వారి భర్త, అత్తమామలతో సంతోషంగా జీవిస్తున్నారు. ఇవేకాకుండా 1152 అవగాహన సదస్సులు నిర్వహించి, మరెంతో మంది మహిళల సమస్యలు పరిష్కారమయ్యేలా చేశారు.

ధైర్యంగా సమస్య చెప్పుకోండి..



ఆపదలో ఉన్న ఆడవాళ్లంతా ధైర్యంగా సమస్యను చెప్పుకోవాలి. నేరుగా కార్యాలయానికి వచ్చి గానీ టోల్‌ఫ్రీ నంబర్ 181 లేదా 8501914624కు ఫోన్ చేసి గానీ ఫిర్యాదు చేయవచ్చు. సమస్యకు అనుగుణంగా అవసరమైన సహాయం అందిస్తాం. తమను ఆశ్రయించిన వారిలో చాలామంది సమస్యలు పరిష్కారమై, ఆనందంగా మంచిగా జీవిస్తున్నారు.

– వి.సాయివిజయలక్ష్మి, సెంటర్ అడ్మినిస్ట్రేటర్, దిశ వన్‌స్టాప్ సెంటర్

ఇవీ సాక్ష్యాలు..

1. బొండపల్లి మండలానికి చెందిన 23 ఏళ్ల వివాహిత భర్త, అత్తమామలు వేధించడంతో దిశ వన్‌స్టాప్ సెంటర్‌ను ఈ ఏడాది అక్టోబర్ 19న తేదీన ఆశ్రయించారు. దీంతో సిబ్బంది ఆమె భర్తను, కుటుంబ సభ్యులను పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ మహిళ తన భర్త, అత్తమామలతో సంతోషంగా జీవిస్తోంది.

2. బొబ్బిలి మండలానికి చెందిన 30 ఏళ్ల వివాహిత భర్త వేధించడంతో ఈ ఏడాది సెప్టెంబర్ 13న తేదీన పురుగుమందు తాగి, ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న దిశ వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది ఆమెకు అవసరమైన వైద్యసాయం అందేలా చర్యలు తీసుకున్నారు. డిశ్చార్జ్ అయిన తర్వాత ఆమెను, ఆమె భర్తను, కుటుంబ సభ్యులను పిలిపించి, కౌన్సిలింగ్ ఇచ్చి, ఒక్కటి చేశారు. ఇంకెప్పుడు ఆమెను ఇబ్బంది పెట్టనని ఆమె భర్తతో భరోసా ఇప్పించారు. ఇలా ఒకరిద్దరు కాదు ఎంతోమంది తమ సమస్యల పరిష్కారానికి దిశ వన్‌స్టాప్ సెంటర్ ద్వారా సహాయం పొందుతున్నారు.

ఏమైందో..ఏమో..?

- పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్య



మృతుడు అరవింద్(ఫైల్)



కుటుంబసభ్యులు, స్నేహితుల నుంచి వివరాలు సేకరించి ఫోన్ కాల్స్ పరిశీలిస్తున్న ఎస్సై గోవింద

వీరఘట్టం: ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న కుటుంబం.. ఇంటికి ఒక్కగానొక్క కొడుకు..హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం..నెలకు రూ.1 లక్ష వరకు జీతం. ఇంటి వద్దే మూడేళ్లుగా వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ఉద్యోగం చేస్తున్నాడు.. ఇంత చక్కటి జీవితం ఆ యువకుడికి ఆనందాన్ని ఇవ్వలేదు..ఏం జరిగిందో ఏమో వంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చాడు. సోమవారం ఊరంతా నూతన సంవత్సరవేడుకలతో ఆనందోత్సవాలు జరుగుతుండగా ఆ ఇంట మాత్రం విషాదం నెలకొంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పాలకొండ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన పాసినవిల్లి అరవింద్(24) వీరఘట్టం మండలం బొడ్డపాడు జీడితోటల్లో శరీరానికి నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఫ్రెండ్స్‌ను బస్సు ఎక్కించి వస్తానని ఇంటి నుంచి బయల్దేరిన అరవింద్ ఉదయం 10 గంటల వరకు కుటుంబసభ్యులతో ఫోన్‌లో టచ్‌లో ఉన్నాడు. తర్వాత బొడ్డపాడు తోటల్లో ఉన్నట్టు ఇంటికి లొకేషన్ షేర్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. ఈ లొకేషన్‌లో ఆదివారం రాత్రి ఈ ప్రాంతంలో వెతికినప్పటికీ జాడ తెలియరాలేదు. సోమవారం మళ్లీ ఇదే లొకేషన్‌కు పదిమంది యువకులు వచ్చి ఇక్కడి తోటలో వెతకగా ఆరవింద్ న్యూడ్ బాడీ కనిపించింది. ఇంకా తోటలో వెతకగా సగం కాలిపోయిన శరీరం కనిపించింది. ఆ శరీరాన్ని పరిశీలించి అరవిందేనని నిర్ధారించారు. ఈ విషయాన్ని వీరఘట్టం పోలీసులకు తెలియజేయగా ఎస్సై ఎం.గోవింద్ సిబ్బందితో సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించి ఆత్మహత్యగా గుర్తించారు. అరవింద్ తండ్రి ఎర్రంనాయుడు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

అప్పులు తీర్చలేక?

మృతుడు అరవింద్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న ఎస్సై ఎం.గోవింద్ దర్యాప్తు చేస్తున్నారు. ప్రొద్దుటూరు, హైదరాబాద్, పాలకొండలతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న ఫ్రెండ్స్ వద్ద అరవింద్ రూ.లక్షల్లో అప్పులు చేసినట్టు గుర్తించారు. అరవింద్‌కు అంతలా అప్పులు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో కోణంలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. తల్లిదండ్రులకు చెప్పలేక, చెబితే ఏమంటారోనని తనలో తాను కుంగిపోయి చివరకు ప్రాణం తీసుకున్నాడని ఎస్సై గోవింద అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు

- ప్రధాన కూడళ్లలో విజిబుల్ పోలీసింగ్
- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేక్ కట్‌చేసిన ఎస్పీ ఎం.దీపిక



వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాటుచేసిన పటిష్ట భద్రత సత్ఫలితాలనిచ్చిందని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేడ్కర్ జంక్షన్, కోట, మూడులాంతర్లు, గంటస్తంభం, ఇతర ప్రాంతాలను సందర్శించి, ఎస్పీ స్వయంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి, ర్యాష్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్‌కు పాల్పడకుండా చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రజలకు, ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై కేసులు నమోదు చేశారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ చేపట్టి మద్యం తాగి, వాహనాలు నడిపే వారిపై 13 డ్రంకన్ డ్రైవ్ కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై 19 కేసులు, మద్యం అక్రమంగా కలిగిన ఉన్న వారిపై 11 కేసులు నమోదుచేశారు. బందోబస్తు అనంతరం ఎస్పీ ఎం.దీపిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేక్ కట్ చేసి, అధికారులు, సిబ్బందికి అందజేసి, అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ వెంట విజయనగరం డీఎస్పీ ఆర్.గోవింద రావు, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, రూరల్ సీఐ టీపీ.తిరుపతిరావు, టూటౌన్ సీఐ ఎస్ హెచ్.విజయానంద్, పలువురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జాతీయ పోటీలకు రాష్ట్ర జట్ల పయనం

- 3 నుంచి ఢిల్లీలో బాక్సింగ్ పోటీలు



జాతీయ పోటీలకు వెళ్తున్న అండర్-19 బాక్సింగ్ జట్టు



అండర్-17 జట్టు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు సోమవారం పయనమయ్యారు. అండర్-17,19 వయస్సుల విభాగాల్లో జిల్లా వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో జరగనున్న జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు రెండు విభాగాల్లో 27 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వీ రమణ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సూర్యారావు, జీపీ సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



పి.వరలక్ష్మికి కారుణ్య నియామక పత్రం అందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: కారుణ్య నియామకం కింద నలుగురికి ఉద్యోగ నియామక పత్రాలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. జిల్లాలోని ఎస్ఎస్ వలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో పెంటమాల అభినవ్, కుమిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సూర్యనారాయణ మూర్తి, సర్వీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పి.వరలక్ష్మి, నెమలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాసాగర్‌లను జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు రావాలని..!



రాజాం మార్కెట్‌లో ఓషాపు వద్ద డైరీలు

- కాలం మారినా పెరుగుతున్న డైరీల వినియోగం
- న్యూ ఇయర్ వేళ మార్కెట్‌లో యువత, ఉద్యోగుల సందడి
- రూ.50 నుంచి లభ్యం

రాజాం: కాలం మారినా, టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా డైరీ మాత్రం తన ప్రాముఖ్యం కోల్పోలేదు. గత చరిత్ర తెలియాలన్నా, భవిష్యత్ కాల వినియోగం పాదుపుగా ఉండాలన్నా, వర్తమానం వృథాకాకుండా ఉండాలన్నా డైరీ వినియోగం తప్పనిసరి. మేధావులు, పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు, రాజకీయ ఉద్దండులు, లక్ష్యాన్ని అవలీలగా ఛేదించే వారి జీవితాల్లో డైరీకి ప్రధమస్థానం ఉంటుంది. డైరీ అంటే ఒక లక్ష్యం, జ్ఞాపకం, ఆత్మకథ. డైరీ రాయడం అలవాటు చేసుకున్నవారు డైరీ రాయకుండా, చూడకుండా ఉండలేరు. పాత జ్ఞాపకాలు తట్టిలేపే డైరీకి నేటి కాలంలో కూడా ఎంతో విలువ ఉంది. ప్రధానంగా న్యూ ఇయర్ వేడుకల్లో ఎవరికైనా గిఫ్ట్‌గా ఇవ్వాలన్నా, ఎవరైనా గిఫ్ట్‌గా ఇచ్చినా డైరీకి ఎంతో గౌరవం ఉంటుంది. చివరికి చాలా మంది సొంతంగా డైరీ కొనుగోలు చేసే అలవాటు కూడా ఉంది.

మార్కెట్‌లో కళకళ

న్యూ ఇయర్ సందర్భంగా డైరీలకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో పుస్తకాల దుకాణాల వద్ద డైరీలు అధికంగా విక్రయానికి సిద్ధం చేశారు. రూ.50 నుంచి రూ.500 విలువచేసే డైరీలు మార్కెట్‌లో ఉన్నాయి. పలు సంఘాలు, సంస్థలు తమ ఉనికిని తెలిపేలా డైరీలు సిద్ధం చేశాయి. డైరీలు విక్రయించే షాపుల వద్ద ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగుల సందడి కనిపిస్తోంది. గ్రీటింగ్స్ కనుమరుగైనా డైరీ వినియోగం మాత్రం తగ్గలేదు. ఈ డైరీల్లో కూడా వివిధ డిజైన్స్‌తో రూపొందించినవి అందుబాటులోకి వచ్చాయి. ఫ్లిప్ కార్ట్, అమెజాన్ తదితర ఆన్‌లైన్ మార్కెట్‌లో వీటి విక్రయాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

జ్ఞాపకాన్ని తెలియజేస్తుంది



డైరీ వినియోగం చాలా మంచి అలవాటు. డైరీని మెయింటెన్ చేయడంతో విలువైన కాలాన్ని వినియోగించుకోవచ్చు. సమయానికి తగ్గట్టుగా మన పనులు మనం చేసుకుంటాం. గతంలో మనం రాసి దాచుకున్న డైరీలు చదువుతుంటే పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటాయి.

– పొట్నూ సత్యనారాయణగుప్త, పారిశ్రామికవేత్త, రాజాం

చాలా మంచి అలవాటు



డైరీ రాయడం అనేది ప్రతి ఒక్కరికీ చాలా మంచి అలవాటు. వాటి ద్వారా విద్యార్థులకు మంచి జ్ఞాపకశక్తి లభిస్తుంది. గతం, వర్తమానంతో పాటు భవిష్యత్ కాలవినియోగం పాదుపుగా ఉంటుంది.

– గార రంగనాథం, రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు, రాజాం

జిల్లాస్థాయి చెస్ విజేతలకు అభినందన



జిల్లాస్థాయి చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో విజేతలను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. అండర్ 7, 9, 11,13,15 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరు కాగా..పోటీల్లో ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్న క్రీడాకారులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు ఏడీఎస్ఏ ప్రసాద్, ఎం.గణేష్ నాయుడులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

మన్యం ప్రజలకు ఆరోగ్య భాగ్యం



గరుగుబిల్లి మండలం పెద్దూరులో జేఏఎస్ శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు(ఫైల్)

- నేటి నుంచి రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష
- జిల్లాలో నెలకు 72 వైద్య శిబిరాల ఏర్పాటు
- ప్రతి ఆరునెలలకోసారి ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- గిరిజన గ్రామాల్లో ఆహార నడపాయం
- మారుమూల గ్రామాల్లో స్పెషలిస్టు డాక్టర్ సేవలు
- ఇంటింటా ఆరోగ్య సర్వేలో నిమగ్నమైన వలంటీర్లు, ఏఎన్ఎంలు

పార్వతీపురం టౌన్: వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులు సత్ఫలితాలనిస్తున్నాయి. నాడు-నేడు నిధులతో ఆస్పత్రుల ఆధునీకరణ, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పల్లె, వార్డు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యాయి. ఇటీవల చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు చక్కని వైద్యాన్ని అందించాయి. ఆరోగ్యభరోసా కల్పించాయి. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు పెంచడమే లక్ష్యంగా మంగళవారం నుంచి రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

నేటి నుంచి రెండోవిడత ఆరోగ్య సురక్ష

ప్రతి ఆరునెలలకోసారి ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నెలకు 72 శిబిరాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమయ్యే మందులను కేంద్ర డ్రగ్ స్టోర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయాలకు పంపించి, అక్కడ నుంచి బాధితులకు అందించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మంగళ, శుక్రవారాలు మండలాల్లోను, ప్రతి బుధవారం పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఉన్న 8 మండలాల్లో మంగళవారం, ఏడు మండలాల్లో శుక్రవారం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ ప్రాంతాల్లో బుధవారం వైద్యశిబిరాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు.

అపూర్వ స్పందన

గత ఏడాది సెప్టెంబర్ 30 నుంచి నిర్వహించిన తొలివిడత జేఏఎస్ (జగనన్న ఆరోగ్య సురక్ష) వైద్య శిబిరాలకు అపూర్వ స్పందన వచ్చింది. జిల్లాలో 292 శిబిరాలు నిర్వహించగా మొత్తం 1,29,191 మంది వైద్యసేవలు పొందారు. 9,178 మందికి బీపీ, 4,571 మందికి మధుమేహం ఉన్నట్టు గుర్తించి చికిత్స, మందులు అందజేశారు. 2,547 మందిని మెరుగైన వైద్యసేవలకు పెద్దాస్పత్రులకు రిఫర్ చేయగా 2,316 మంది చికిత్స పొందారు. కంటివెలుగు కింద 18,773 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, 1260 మందికి కేటరాక్ట్ సమస్య గుర్తించి 392 మందికి శస్త్ర చికిత్సలు పూర్తి చేశారు. 1229 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

రెండో విడత శిబిరాల నిర్వహణ ఇలా...

మండలం	నిర్వహించనున్న శిబిరాలు
బలిజిపేట	17
భామిని	13
గరుగుబిల్లి	11
గుమ్మలక్ష్మీపురం	22
జియ్యమ్మవలస	24
కొమరాడ	18
కురుపాం	19
మక్కువ	15
పార్వతీపురం అర్బన్	15
పాచిపెంట	15
పాలకొండ అర్బన్	9
పాలకొండ	20
పార్వతీపురం	17
సాలూరు	20
సాలూరు అర్బన్	14
సీతంపేట	29
సీతానగరం	20
వీరఘట్టం	22